క్లుప్తంగా

కుటీర పరిశ్రమల ద్వారా అభివృద్ధి చెందాలి



వర్ని: (మోస్రా) రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో మహిళలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి అభివృద్ధి చెందాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. మోస్రా మండల కేంద్రంలో డ్వాక్రా మహిళలతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డ్వాక్రా గ్రూపుల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న 30% రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, స్థానికంగా ఆదరణ ఉన్న కుటీర పరిశ్రమలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ మోకీం, ఎంపీడీవో భారతి, ఏపీవో సురేశ్, సీసీ నర్సయ్య, రాజలింగం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం బద్దం రవిరెడ్డి బుధవారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బద్రి, బద్దం రాజేశ్, చంద్రశేఖర్, రాజారాం పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నా రు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



ఆర్మూర్‌టౌన్/మాక్లూర్: డిమాండ్ల సాధన కోసం పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజైన బుధవారం కొనసాగింది. ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా ప్రాంతంలో ఉన్న పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతోపాటు నూతన పీఆర్సీ, అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలని కోరారు. ఆర్మూర్ సబ్ డివిజన్ నాయకులు లింబాగౌడ్, రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీపీఎంలు శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండల కేంద్రంలోనూ తపాలా ఉద్యోగులు సమ్మె చేశారు. డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగిస్తామని మాదాపూర్ తపాలా ఉద్యోగి కిరణ్ అన్నారు.



టీజీవీపీ నాయకుల నిరసన

నిజామాబాద్‌అర్బన్: నగరంలో బుధవారం టీజీవీపీ (తెలంగాణ విద్యార్థి పరిషత్) నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అవకతవకలకు పాల్పడిన టీఎస్పీఎస్సీ బోర్డ్ చైర్మన్, సభ్యులందరినీ వెంటనే జైలుకు పంపాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి, విచారణ జరిపించాలన్నారు.

అధ్వానంగా ముప్కాల్-మెండోరా రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పునరుద్ధరణకు రూ.1.95 కోట్ల నిధులు మంజూరు
- ప్రారంభం కాని పనులు



గుంతలమయమైన రోడ్డు..



మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నుంచి మెండోరా మండలం కేంద్రం వరకు రోడ్డు పునరుద్ధరణ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో రెండు మండల కేంద్రాలను కలుపుతూ 2017లో నూతనంగా తారు రోడ్డును నిర్మించారు. కానీ నిర్మించిన కొన్నిరోజులకే తారురోడ్డు దెబ్బతిన్నది. అప్పటి నుంచి గుంతలమయమైన రోడ్డు మీదుగానే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వం ఎట్టకేలకు సెప్టెంబర్‌లో రూ.1.95 కోట్ల నిధులు మంజూరు చేసింది. అదే సమయంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పునరుద్ధరణ పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభమవుతాయో సంబంధిత అధికారులకు కూడా అవగాహన లేక పోవడం చర్చనీయాంశమవుతున్నది.

అధ్వానంగా రోడ్డు

ముప్కాల్ - మెండోరా మండలకేంద్రాలను కలుపుతూ నిర్మించిన తారు రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రతి రోజూ ముప్కాల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నుంచి మెండోరా మండల కేంద్రానికి అధికారులు, సిబ్బంది ప్రయాణం చేస్తున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో నరక యాతన అనుభవిస్తున్నారు. 2017 ఆగస్టులో అప్పటి సీఎం ఎస్సారెస్పీ సందర్శనకు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఈ రోడ్డు గుండా వాహనాలను మళ్లించారు. ఈ రోడ్డుగుండా భారీ వాహనాలు రావడంతో రోడ్డు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి రోడ్డుపై గుంతలు అలానే ఉన్నాయి. కానీ రోడ్డు మరమ్మతులకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఎట్టకేలకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం ఆలస్యం అవుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు. రోడ్డు పనుల పునరుద్ధరణపై పంచాయతీరాజ్ అధికారులను 'సాక్షి' ఫోన్‌లో పలుమార్లు సంప్రదించే ప్రయత్నం చేసినా స్పందించలేదు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

నవీపేట(బోధన్): మండల కేంద్రంలోని ఆదర్శ, ప్రభుత్వ బాలికల పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు మితి మీరిపోతున్నాయి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం మండల అధ్యక్షులు భానుగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఎస్సైకి బుధవారం వినతిపత్రం అందజేశారు. చాలామంది ట్రిపుల్ రైడింగ్ చేస్తూ అమ్మాయిల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అసభ్యంగా సైగలు చేస్తూ వేధిస్తున్నారన్నారు. ఆకతాయిలపై చర్యలు తీసుకోనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్, గంగోని లక్ష్మణ్, చరణ్‌రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, రాకేశ్, వినీత్, పునాది ప్రవీణ్, గంగోని రాము, అన్నారం సాయినాథ్, వినీత్, మల్లెపూల సాయి, హరీశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు హక్కులను కోల్పోవద్దు



మాక్లూర్: విద్యార్థులు ఏ పరిస్థితుల్లోనూ తమ హక్కులను కోల్పోవద్దని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు తమ హక్కులను ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీప్రియ, సునీత, మాధవి, వరలక్ష్మి, ఎస్సై సుధీర్‌రావు, దేవపాల, రాజేశ్, సరిత, ఆశ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బోధన్ పట్టణ ఆస్పత్రి సిబ్బంది



గురుకుల డిగ్రీ కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆర్మూర్‌టౌన్/బోధన్ టౌన్: సెమీ క్రిస్మస్ వేడుకలను ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ధనవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్‌ను జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శోభ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో సౌకర్యాలు కల్పించాలి



కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: పట్టణంలోని అంగడి బజార్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే రైతులు, కొనుగోలుదారులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలోని రైతు బజార్‌ను మున్సిపల్ అధికారులతో కలి సి ఎమ్మెల్యే బుధవారం తనిఖీ చేశారు. కూరగాయలు విక్రయిస్తున్న రైతులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. తైబజార్ కాంట్రాక్టర్ అధికంగా ఫీజులు వసూలు చేయడం, కనీస సౌకర్యాలు లేకపోవడంతో మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీల నాయకులతో, పట్టణ ప్రజలతో చర్చించి వారి సలహాలు, సూచనలు తీసుకొని వారం రోజుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే అసెంబ్లీలో రైతుల గురించి మాట్లాడినప్పటికీ.. స్థానికంగా రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. రైతుబజార్ దళారులకు కాకుండా ఆర్మూర్ ప్రాంత రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుబజార్‌లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, డీఈ భూమేశ్, ఏఈ రఘు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, బీజేపీ నాయకులు కంచెట్టి గంగాధర్, ఆకుల రాజు, ఆకుల శ్రీనివాస్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, యామాద్రి భాస్కర్ పటేల్, ద్యాగ ఉదయ్ తదితరులున్నారు.

నిస్వార్థంగా సేవ చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పెర్కిట్(ఆర్మూర్): ఉద్యోగ సంఘాల నాయకులు నిస్వార్థంగా సేవ చేయడంతోపాటు ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందేలా కృషి చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యేను ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమా ర్, టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడు శికారి రాజు, సతీశ్, గంగాకిషన్, పురుషోత్తం, సంజీవయ్య, జాకీర్ హుస్సేన్, ఉమాకిరణ్, గురుచరణ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా చూడండి

సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి విద్యాశాఖలో విలీనం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని కోరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించి సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మహిళా అధ్యక్షురాలు గంగామణి, కేజీబీవీ, సీఆర్పీ, ఐఈఆర్పీలు అన్నపూర్ణ, వీణ, సునీత, లత, గంగాధర్, సంతోష్, జయరాజ్, పవిత్రన్, లింబాద్రి స్వామి, గంగాధర్ తదితరులున్నారు.

బాలసదన్‌కు బాలిక తరలింపు



అనాథ బాలికను ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్ బాల కార్మికురాలిని బాలసదన్‌కు తరలించారు. నవీపేట గ్రామానికి చెందిన సింధాల్ అనే బాలిక ఆలూర్ గ్రామంలో గత పదిహేను రోజులుగా చిత్తు కాగితాలు ఏరుకుంటూ తిరుగుతోంది. గమనించిన విజయ్ బాలిక వివరాలను ఆరా తీశారు. బాలిక తల్లి చిన్నప్పుడే మృతి చెందడంతో తండ్రి మరొకరిని వివాహం చేసుకున్నాడని తెలియడంతో.. విజయ్ వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందజేసి బాలికను జిల్లా కేంద్రంలోని బాలసదన్‌కు తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవనీత్, సంతోష్, ముత్యం, సంజీవ్, చైల్డ్ హెల్ప్ లైన్ ఆఫీసర్ సౌజన్య, అంగన్‌వాడి టీచర్లు లావణ్య, పద్మ, విజయ, రాణి పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపునకు సర్వే



సర్వే నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

బోధన్ రూరల్ (బోధన్): బడి బయటి పిల్లల గుర్తింపునకు మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో విద్యాశాఖ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ముగ్గురిని గుర్తించి పాఠశాలలో చేర్పించినట్లు పెంటాకుర్దు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్ తెలిపారు. సీఆర్పీల ద్వారా ఈనెల 11నుంచి వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు విజయ్, రేఖ, ఉపాధ్యాయుడు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ డేను విజయవంతం చేయాలి



బోధన్ : నిజామాబాద్ నగరంలో ఈ నెల 19న నిర్వహించనున్న పెన్షనర్స్ డేను విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ ప్రతినిధులు కోరా రు. పట్టణంలో బుధవారం అసోసియేషన్ డివిజన్ కమిటీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న తమ డీఏలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల 1వ తేదీన పింఛన్ అందించాలని కోరారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, అద్దంకి ఉషాన్, ప్రతినిధులు వెంకట్రావు, ప్రకాశయ్య, అద్దంకి లింగన్న, జ్ఞానేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

బోధన్: రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ బుధవారం తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీల నివేదికపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంపై ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామ ప్రధాన కూడలిలో రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'వద్దురా నాయన కాంగ్రెస్ పాలన, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా తాము ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



సాటాపూర్‌లోని ప్రధాన కూడలిలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

19న వేసెక్టమీ శిబిరం



బోధన్‌టౌన్: బోధన్‌లోని జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 19న వేసెక్టమీ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. బుధవారం ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల్లో భాగంగా పురుషులకు నిర్వహించే వేసెక్టమీపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్ (తెలుగు)-9.40; యానిమల్ (హిందీ) 1.00, 5.00, 9.00
- స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 09.30, 12.45, 4.00, 7.15, 10.30
- స్క్రీన్-3 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్ (తెలుగు)- 11.50, 3.10, 6.30, 9.50
- స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00

దుప్పట్లు, క్రీడాపరికరాల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవితారెడ్డి

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు, క్రీడా పరికరాలు అందజేశారు. చలికాలంలో దుప్పట్లు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి జేడీ ఫౌండేషన్ చైర్మన్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి 200 మంది బాలికలకు దుప్పట్లు, క్రీడా పరికరాలు సమకూర్చారు. జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవితారెడ్డి స్వయంగా హాజరై వాటిని బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి జేడీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి వినోద, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, గ్రామస్తులు రమేశ్, నర్సారెడ్డి, భూమన్న, సచిన్, జేమ్స్, జీజీ, అలీం, లింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్..



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి ప్రాథమిక పాఠశాలకు మండల కేంద్రానికి చెందిన నునుగొండ అంజయ్య కంప్యూటర్‌ను అందించారు. దాతను ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఉప సర్పంచ్ గంగాధర్, ఎస్ఎంసీ చైర్మన్ పిప్పెర గణేశ్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, సాగర్ రెడ్డి, కనకయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చర్చనీయాంశమైన అవిశ్వాసం

- మాక్లూర్-2 ఎంపీటీసీని కిడ్నాప్ చేశారని ఫిర్యాదు
- దైవదర్శనానికి వెళ్లానని వీడియో రిలీజ్ చేసిన సభ్యురాలు



మాక్లూర్ మండల పరిషత్ భవనం

మాక్లూర్: ఎంపీపీ మాస్త ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ప్రక్రియ పది రోజులుగా రోజుకో మలుపు తిరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఎంపీటీసీలందరూ ఏకమై మాస్త ప్రభాకర్‌ను పదవి నుంచి దింపేసేందుకు పార్టీలకు అతీతంగా పావులు కదిపారు. విషయం బయటకు పొక్కడంతో ఎంపీపీ మాస్త ప్రభాకర్ తన పదవిని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఎంపీపీ స్థానం జనరల్‌కు రిజర్వు కావడంతో అప్పట్లో మెట్‌పల్లికి చెందిన పురుషోత్తంరావు రేసులో నిలిచారు. తనకు సంబంధం లేని కొత్తపల్లి నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచారు. పురుషోత్తంను ఎంపీపీ చేస్తానని అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హామీ ఇచ్చి మాట తప్పారని, తన ప్రధాన అనుచరుడు, గుత్ప ఎంపీటీసీ మాస్త ప్రభాకర్‌ను ఎంపీపీ పీఠంపై కూర్చోబెట్టారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న సైతం ఎంపీపీ పదవిని ఆశించి జీవన్‌రెడ్డిని గట్టిగానే నిలదీయడంతో, ఇద్దరూ రెండున్నరేళ్ల చొప్పున పదవిలో కొనసాగాలని బాండ్ పేపర్ సైతం రాయించారు. రెండున్నరేళ్ల పూర్తి కావస్తుండడంతో ఒడ్డెన్న మరోసారి జీవన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన పట్టించుకోలేదని తెలిసింది. పైగా ఆయన చేసిన కొన్ని అభివృద్ధి పనుల డబ్బులు నిలిపివేయించి ఇబ్బంది పెట్టారనే ఆరోపణలున్నాయి. అవకాశం కోసం ఎదురు చూసి ఎన్నికలకు 20 రోజుల ముందు బీజేపీలో చేరిన గోవూరి ఒడ్డెన్న రాకేశ్‌రెడ్డి గెలుపునకు తీవ్రకృషి చేసి విజయం సాధించారు. ఆ వెంటనే ఎంపీపీపై అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మొత్తం 14 మంది ఎంపీటీలకుగాను 10 మంది ఎంపీటీసీలను తన వైపునకు తిప్పుకుని అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. చివరి నిమిషంలో కాంగ్రెస్ ఎంపీటీసీ వెనక్కి తగ్గారు. ఆ సమయంలోనే మాక్లూర్ – 2కు చెందిన మరో ఎంపీటీసీ మీరాబాయిని పతకం ప్రకారం ఎంపీపీ మాస్త ప్రభాకర్ ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేయకుండానే తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. గోవూరు ఒడ్డెన్న శిబిరంలోని 10 మంది ఎంపీటీసీల సంఖ్య 8కి చేరింది. ఎంపీపీ మాస్త ప్రభాకర్ వద్ద ఆరుగురు ఎంపీటీసీలున్నారు. అవిశ్వాసం పెట్టాలంటే ఒడ్డెన్నకు మరో ఎంపీటీసీ అవసరం ఏర్పడింది. కాంగ్రెస్ ఎంపీటీసీ మద్దతు కోరిన సందర్భంలో అధికారంలో ఉన్నాం కాబట్టి తనకే ఎంపీపీ పదవి ఇవ్వాలని లేదా బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరితే తప్పా మద్దతు ఇవ్వలేమని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాక్లూర్ ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు స్పష్టం చేసినట్లు తెలిసింది. చేసేదేమీలేక ఒడ్డెన్న అతనిపై ఆశలు వదులుకుని మాక్లూర్ -2 ఎంపీటీసీ మీరాబాయి మద్దతుపై ఆశలు పెంచుకున్నారు. ఈ క్రమంలో మీరాబాయిని ఎంపీపీ మాస్త ప్రభాకర్ కిడ్నాప్ చేశారని ఆమె భర్త నారాయణతో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. రెండు రోజులైనా ఫిర్యాదుపై స్పందన లేకపోగా, మరోవైపు మీరాబాయి తాను క్షేమంగా ఉన్నానని, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, దైవ దర్శనానికి వెళ్లానని వీడియో విడుదల చేసింది.